సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 19 । జనవరి । 2025



చట్టాలపై అవగాహన అవసరం

చింతలపూడి: జైలులో ఖైదీలకు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు అన్నారు. చింతలపూడిలో సబ్ జైలును ఆయన సందర్శించారు.



జయ జనార్దనా.. కృష్ణా..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి కృష్ణావతారంలో అలంకరణ చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా కళాంజలి నృత్యనికేతన్ (పాలకొల్లు) కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

20న మెగా షుగర్ వైద్య శిబిరం



వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

భీమవరం: యూకే-ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పలపాటి వెంకట కృష్ణంరాజు మెమోరియల్ ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్స శిబిరాన్ని ఈనెల 20న భీమవరం డీఎన్నార్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్టు దివంగత కేంద్ర మంత్రి కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి తెలిపారు. శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ వేణు కవర్తపు (లండన్) ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం షుగర్ బాధితులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తామన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, డాక్టర్ పీఆర్‌కే వర్మ మాట్లాడుతూ పలు దేశాలకు చెందిన సుమారు 40 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు సేవలందింస్తారని, రోగులు ముందుగా సెల్ 96763 09926, 99893 42009, 94904 32934 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కుష్టు నివారణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 20 నుంచి వచ్చేనెల 2 వరకు కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ బి.భానునాయక్ తెలిపారు. భీమవరంలో శనివారం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరినీ పరీక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనుమానిత కేసులు ఉంటే పీహెచ్‌సీల్లో పరీక్షలు చేయించాలన్నారు. కుష్టుని ఆరంభంలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, అధికారులు జి.గణపతిరావు, బి.రామానుజరావు, టి.పుష్పరాణి పాల్గొన్నారు.

రంజింపజేసిన 'రాగ-సాగర'



మాట్లాడుతున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

ఆకివీడు: మనసును హత్తుకునేలా, వినూత్నంగా విశ్వంభర రాగ సాగర ఆధ్యాత్మిక రాగాన్ని గణపతి సచ్చిదానంద స్వామీజీ వినిపించారు. స్థానిక దత్త క్షేత్రంలో మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ శనివారం విశ్వంభర రాగ సాగర అనే నూతన సంగీత వాయిద్యాన్ని విన్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సంగీతం ద్వారా దీర్ఘ వ్యాధులను పారదోలవచ్చన్నారు. తమ ఆశ్రమం ద్వారా ఎందరికో ఇలా నయం చేశామన్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతి పొందిన రాగ-సాగర కార్యక్రమాన్ని ఆకివీడులో ఏర్పాటు చేయడం ఈ ప్రాంత ప్రజల పుణ్యమన్నారు. ఆలయాల్ని, ఆశ్రమాల్ని, క్షేత్రాల్ని ప్రజలు పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక దత్త క్షేత్రానికి రూ.కోటి విరాళంగా అందజేయడం, రాగ-సాగర ద్వారా మరో రూ.50 లక్షల ఆదాయం సమకూరడం ఆనందంగా ఉందన్నారు. ఈ మొత్తాన్ని ఆకివీడు క్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు. ఆధ్యాత్మికతతో దేనినైనా జయించవచ్చని, ఆయుధం కన్నా ఆధ్యాత్మికత విన్న అని స్వామీజీ అన్నారు. దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి, ట్రస్టీలు, భక్తులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చిన్న తప్పిదంతో జీవితాన్ని కోల్పోవడం, అంగవైకల్యం పొందడం జరుగుతుందని, వాహనచోదకులతో పాటు సహ ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ హితవు పలికారు. ఏలూరులో న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ అధ్యక్షతన హెల్మెట్ ధారణ-ప్రమాదాల నివారణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని, శనివారం న్యాయశాఖ ఉద్యోగస్తులు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కారులో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

కర్షకులకు కలుపు కష్టాలు

గుర్రపుడెక్క ముంచేను

- తొలకరిలో భారీ వర్షాలు, వరదలతో నీటమునిగిన చేలు
- డ్రెయిన్లలోంచి పొలాల్లోకి చేరిన గుర్రపుడెక్క
- దాళ్వాలో కలుపు రూపంలో రైతులకు అవస్థలు
- మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం లేదంటున్న రైతులు
- ఇప్పటికే పెట్టుబడులకు సొమ్ముల్లేక ఇక్కట్లు
- జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో రబీ సాగు



రబీ పంటకు కలుపు తంటా.. ఈడూరు వద్ద వరి పొలంలో గుర్రపుడెక్క, కలుపు మొక్కలు

సాక్షి, భీమవరం: రబీలోనూ రైతులను ఖరీఫ్ కష్టాలు వెంటాడుతున్నాయి. గుర్రపుడెక్క, కలుపు రూపంలో పంటలకు నష్టాలు కలిగిస్తున్నాయి. ఇప్పటికే పెట్టుబడులకు డబ్బుల్లేక ఇబ్బంది పడుతుంటే కలుపు నివారణకు అదనపు వ్యయమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 50 శాతం మేర నాట్లు

జిల్లాలోని 2.22 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు 50 శాతం మేర నాట్లు పూర్తికాగా నెలాఖరు నాటికి 90 శాతం పూర్తవుతాయని వ్యవసాయాధికారుల అంచనా. అధిక శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1121 రకం సాగు చేస్తుండగా, మిగిలిన చోట్ల పీఆర్ 126, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలను సాగు చేస్తున్నారు. ముందుగా సాగు ప్రారంభించిన తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు ప్రాంతాల్లో వరి పైరు మూనలు వేస్తోంది. కాగా ప్రస్తుతం రబీ రైతులను పొలాల్లో గుర్రపుడెక్క, కలుపు సమస్య తీవ్రంగా వెంటాడుతోంది.

పెట్టుబడులు తడిసిమోపెడు

ఖరీఫ్ కలిసిరాక, ప్రభుత్వం నుంచి భరోసా, పంట నష్టపరిహారం సాయం అందక రబీ పంటకు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్న రైతులకు కలుపు సమస్య తలనొప్పిగా తయారైంది. రెండు పర్యాయాలు దమ్ముచేసి నాట్లు వేసిన తర్వాత పలుచోట్ల పొలాల్లో గుర్రపుడెక్క, పాదులు మొలుస్తుండటంతో ఏంచేయాలో పాలుపోని స్థితిలో రైతులు ఉన్నారు. రెండుసార్లు కలుపు మందు కొట్టినా ఫలితం లేదని, మందు ప్రభావంతో వరిపైరు ఎండిపోతోందని చెబుతున్నారు. కలుపు నివారణ కోసం చేపడుతున్న చర్యలతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు.

ముంపు తెచ్చిన కలుపు

ఖరీఫ్ పంటకు ఎన్నడూ లేనివిధంగా నాట్లు దశలోనే భారీ వర్షాలు, వరదలు నష్టం కలిగించాయి. 2.05 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు చేయగా ఆగస్టు చివరిలో కురిసిన భారీ వర్షాలకు వయ్యేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, ఉప్పుటేరు ముంపుతో పెంటపాడు, అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు తదితర మండలాల్లోని 18 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరాలకు చెందిన నారుమడులు దెబ్బతిన్నాయి. ఆయా ప్రాంతాల్లో రెండోసారి నాట్లు, నారుమడులు వేయాల్సి వచ్చింది. మరోసారి గోదావరి, కొల్లేరుకు వచ్చిన వరదలు అత్తిలి, పాలకోడేరు, పెంటపాడు, తణుకు, ఆకివీడు, కాళ్ల, నరసాపురం మండలాల్లోని పొలాలను ముంచెత్తి పంటకు అపార నష్టం కలిగించాయి. ముంపు నీటితో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పొలాల్లోకి చేరి మేటలు వేశాయి. ముందుకు సాగలేని పరిస్థితుల్లో జిల్లాలో దాదాపు 14 వేల ఎకరాలను రైతులు ఖరీఫ్ సాగు చేయకుండా ఖాళీగా వదిలేశారు.



కలుపు మందు ప్రభావానికి మాడిపోయిన పైరు

కలుపు నివారణలో జాగ్రత్తలు తప్పనిసరి



పొలాల్లో గుర్రపు డెక్క సమస్యపై మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్ర వేత్త డా. ఎంవీ కృష్ణాజీని సంప్రదించినప్పుడు చేసిన సూచనలు ఆయన మాటల్లోనే.. కలుపు నివారణలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. నీరు, సూర్యరశ్మి కోసం కలుపు మొక్కలు పొలంలోని ప్రధాన పంటతో పోటీ పడి నష్టం కలుగజేస్తాయి. నిర్ణీత సమయంలో, నిర్ణీత మోతాదులో మందును వినియోగించి నివారణ చర్యలు చేపట్టాలి. లేకుంటే కలుపు నివారణ సరిగా జరగకపోగా సాగు ఖర్చు పెరిగిపోతుంది. సిఫార్సు చేయని, పూర్తి వివరాలు తెలియని కలుపు మందులను ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. పారాక్వాట్, గ్లైఫోసేట్ కొన్ని రకాల కలుపు మందులు పంట, కలుపు అనే విచక్షణ శక్తి లేక అన్ని మొక్కలను పూర్తిగా నాశనం చేస్తాయి. ఎండ ఎక్కువగా ఉన్నపుడు, గాలి ఎక్కువగా వీస్తున్నపుడు కలుపు మందులు పిచికారీ చేయకూడదు. ఉదయం, సాయంత్రం వేళల్లో గాలి తక్కువగా ఉన్నపుడు పిచికారీ చేయాలి. గాలికి ఎదురుగా పిచికారీ చేయకూడదు. గుర్రపుడెక్క నివారణకు ఎకరాకు 400 గ్రా. 2,4 డీ సోడియం సాల్ట్ లేక 400 మీ.లీ 2,4 డీ అమైన్ సాల్ట్ కలుపుపై పడేలా పిచికారీ చేయాలి

రెండు సార్లు కలుపు మందు కొట్టినా..



15 ఎకరాలు కౌలు సాగు చేస్తున్నా. తొలకరిలో రెండుసార్లు పొలాలు ముంపుబారిన పడ్డాయి. ఏడు ఎకరాల్లో పంట బాగా దెబ్బతినడంతో సాగు చేయలేక ఖాళీగా వదిలేశాం. ప్రభుత్వం నుంచి సాయం ఏమీ అందలేదు. ఇప్పుడు దాళ్వా సాగు చేస్తే పొలంలో గుర్రపుడెక్క, చెత్త పెరిగిపోతోంది. రెండుసార్లు కలుపు మందు కొట్టినా ఫలితం లేదు. మందు ప్రభావానికి పైరు మాడిపోతోంది.

– ఆర్తి నాగేశ్వరరావు, కౌలురైతు, ఈడూరు

తాగడంలో తగ్గేదేలే..!

- పండుగ మూడు రోజుల్లో రూ.27 కోట్లకుపైగా మద్యం విక్రయాలు
- ఈనెల 15 వరకు రూ.120 కోట్లకు పైగా అమ్మకాలు



దెందులూరు: సంక్రాంతి పెద్ద పండుగను పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మద్యం వ్యాపారం భారీగా సాగింది. పండుగ మూడు రోజుల్లో మొత్తంగా రూ.25 కోట్లకు పైగా మద్యం విక్రయాలు జరిగాయి. సంక్రాంతికి ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం, కోడిపందేల బరుల వద్ద యథేచ్ఛగా మద్యం విక్రయించడం, వీధివీధినా బెల్టు షాపులు ఉండటంతో ఎక్సైజ్‌కు భారీగా ఆదాయం సమకూరింది.

రూ.120 కోట్ల అమ్మకాలు

ఉమ్మడి జిల్లాలో ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు రూ.120 కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగాయి. ప్రధానంగా పండుగ రోజుల్లో భోగి (ఈనెల 13), సంక్రాంతి (ఈనెల 14), కనుమ (ఈనెల 15) నాడు ఏలూరు జిల్లాలో రూ.15 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.12 కోట్లకుపైగా విక్రయాలు జరిగాయి. గత నెలతో పోలిస్తే ఈనెలలో ఇప్పటివరకు 20 శాతం మేర అదనంగా మద్యం విక్రయించారు. ఏలూరు జిల్లాలో 144, పశ్చిమగోదావరి జిల్లాలో 175 మద్యం దుకాణాలు ఉన్నాయని, పండుగ మూడు రోజుల్లో సుమారు రూ.27 కోట్ల మేర విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభుకుమార్ తెలిపారు.

నూరుశాతం ఆక్యుపెన్సీతో ఆర్టీసీ

సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు పెద్ద సంఖ్యలో బంధువులు తరలిరావడంతో ఆర్టీసీ బస్సులు వంద శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. వందల సంఖ్యలో ప్రత్యేక సర్వీసులు నడుస్తున్నాయి. ఏలూరు ఆర్టీసీ డిపో 131 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటుచేసింది. హైదరాబాద్‌కు 72, విశాఖకు 4 హైటెక్ బస్సులు ప్రత్యేకంగా ఉన్నాయి. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు నడుపుతామని ఆర్టీసీ డీపీటీఓ ఎన్‌వీ వరప్రసాద్ తెలిపారు. ఈనెల 8 నుంచి 13 వరకు 131 సర్వీసుల ద్వారా రూ.43 లక్షల ఆదాయం ఆర్టీసీకి సమకూరింది. దూర ప్రాంతాలకు సోమ, మంగళవారాల వరకు ప్రజలు రిజర్వేషన్లు చేసుకుంటున్నారని, రద్దీ దృష్ట్యా అప్పటికప్పుడు బస్సులు ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆటోడ్రైవర్‌పై అక్రమ కేసులు దుర్మార్గం

- ఎమ్మెల్యే ఆరిమిల్లివి కవ్వింపు చర్యలు
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు సాయిబాబారెడ్డి ధ్వజం



తణుకులో దుర్గారావుకు పూలమాల వేసి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తణుకు అర్బన్: వైఎస్ జగన్ అభిమాని, ఆటో డ్రైవర్ పంజా దుర్గారావును తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నడిరోడ్డుపై అటకాయించి దౌర్జన్యం చేయడమే కాకుండా పోలీసులతో అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ లీగల్ టీం సభ్యుడు, మాజీ ఏపీపీ వెలగల సాయిబాబారెడ్డి విమర్శించారు. దుర్గారావును శుక్రవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 41 నోటీసు ఇచ్చి విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిబాబారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అతి సామాన్యుడైన ఆటో డ్రైవర్‌పై ఎమ్మెల్యే స్థాయిలో విరుచుకుపడి అక్రమ కేసు కట్టించి ఆయన స్థాయిని దిగజార్చుకున్నారని ఎద్దేవా చేశారు. తాను చేస్తున్న అక్రమాలపై నోరెత్తకుండా భయపెట్టే క్రమంలో ఎమ్మెల్యే ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడటాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దుర్గారావుపై పెట్టిన అక్రమ కేసులో తమ వద్ద ఉన్న సాక్ష్యాల ప్రకారం ప్రైవేటు కేసు వేస్తామని ఎవరు ఎవరిని వెంటాడి, వేధించారో తేలుస్తామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తణుకు ప్రాంతంలో అక్రమ కేసులు కట్టించడం హేయమైన చర్యగా పరిగణించాలన్నారు. తేతలిలో పశువధశాలకు అనుమతులు లేకున్నా ఎమ్మెల్యే ఆరిమిల్లి అండగా ఉంటూ పోలీసులను కాపలా పెట్టించి మరీ నడుపుతున్నారని దుయ్యబట్టారు. ఈ వ్యవహారంపై ప్రజలంతా చీదరించుకున్నారన్నారు. పశువధశాల విషయంలో పోలీసులు, రెవెన్యూ విభాగాలు పూర్తిగా విఫలమయ్యారని, వీరిపై లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రైవేటు కేసులు వేసేందుకు సిద్ధంగా ఉన్నామని, త్వరలో హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేయనున్నట్టు చెప్పారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలుచేస్తే మా బుక్ మేము కూడా తెరుస్తామని హెచ్చరించారు.

దుర్గారావుకు స్వాగతం

మధ్యాహ్నం 3 గంటలకు తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చిన దుర్గారావుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్వాగతం పలికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఆపద సమయంలో అండగా నిలిచిన మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ శ్రేణులందరికీ రుణపడి ఉంటానని అన్నారు. పెరవలి ఎంపీపీ కాచ్చెర్ల ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, నాయకులు వి.సీతారాం, వైఎస్సార్‌సీపీ తణుకు, పెరవలి పార్టీ శ్రేణులు ఉన్నారు.

20 నుంచి పశువైద్య శిబిరాలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు అన్ని మండలాల్లో రోజుకు రెండు పంచాయతీల చొప్పున పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి శిబిరాలు నిర్వహిస్తామని, పశువులకు సాధారణ చికిత్సలు, గర్భకోస వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందిస్తామన్నారు. కృత్రిమ గర్భాధారణ, గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. అలాగే నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. అలాగే జంతు సంక్షేమంపై అవగాహన కల్పిస్తారన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, ఉపాధి హామీ ద్వారా పశుగ్రాసాల పెంపకం, జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌పై అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు.

మద్యం తాగి వ్యక్తి మృతి



ఆకివీడులో మద్యం షాపు ఆవరణలో మృతిచెందిన ముని

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులో ఎక్సైజ్ సర్కిల్ ఆఫీసుకు కూతవేటు దూరంలో జల్సా మద్యం షాపు ఆవరణలో మద్యం సేవించి శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. కొల్లిగడ్డి ముని (55) అనే వ్యక్తి రెండు రోజులుగా మద్యం అతిగా తాగడంతో మృతిచెందాడని స్థానికులు చెబుతున్నారు. మద్యం షాపు వెనుక భాగంలో భారీగా సిట్టింగ్‌కు ఏర్పాటుచేయడంతో మందుబాబులు విచ్చలవిడిగా తాగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సిట్టింగ్ ప్రాంతంలో అన్నీ సమకూర్చడంతో అర్ధరాత్రి వరకూ ఇక్కడే ఉంటూ మద్యం తాగుతున్నారని అంటున్నారు. ఏ సమయంలో అయినా మద్యం అందుబాటులో ఉండటంతో పలువురు అతిగా తాగి రోడ్లపై పడిపడుతున్నారని, మరికొందరు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రాందీ షాపుల వద్ద అనధికార సిట్టింగులు ఉన్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని అంటున్నారు. ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, సిట్టింగులు తొలగించాలని కోరుతున్నారు.

ధాన్యం సొమ్ముల జమలో జాప్యం



కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దొడ్డనపూడి రైతులు

కాళ్ల: తాము అమ్మిన ధాన్యానికి సొమ్ములు ఇప్పించాలంటూ దొడ్డనపూడికి చెందిన రైతులు కాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. దొడ్డనపూడికి చెందిన కొందరు రైతులు పది రోజుల క్రితం కాళ్ల సొసైటీ ద్వారా ఆఫ్‌లైన్‌లో గ్రామంలోని లక్ష్మీ బాలాజీ రైస్ మిల్లుకు ధాన్యాన్ని తోలారు. దాదాపు ఏడున్నర ఎకరాలకు సంబంధించిన ధాన్యం సొమ్ములు జమచేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని, అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ఇక్కడకు వస్తే తహసీల్దార్ అందుబాటులో లేరని, ధాన్యం సొమ్ములు చేతికందక పోవడంతో దాళ్వా పంట పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 48 గంటల్లోపు ధాన్యం సొమ్ములు చెల్లిస్తామని చెప్పారని, తమకు మాత్రం న్యాయం జరగడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు ధాన్యం సొమ్ములు ఇప్పించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

కలెక్టర్ నాగరాణి



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): స్వచ్ఛ పశ్చిమగోదావరి జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం భీమవరం ఆదర్శనగర్ పార్కులో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులతో కలిసి ఆమె ప్రారంభించారు. పార్కులో చెత్తను వారు తొలగించి శుభ్రం చేశారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజ ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత దోహదపడుతుందన్నారు. భీమవరం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలను ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రంగా ఉంచేందుకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం స్వచ్ఛతపై ప్రజలు, అధికారులు, సిబ్బంది, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రశీదులు ఇవ్వాల్సిందే

- ముక్తకంఠంతో కోరుతున్న ప్రజలు
- సంచలనం రేపిన 'సాక్షి' కథనం

నూజివీడు: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గతంలో జరిగిన దోపిడీపై, మళ్లీ దోపిడీ చేసేందుకు కొందరు పావులు కదుపుతున్న వైనంపై 'సాక్షి' ప్రచురించిన కథనం ఆగిరిపల్లితో పాటు నియోజకవర్గవ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది. దేవుడి పేరు చెప్పుకొని చేస్తున్న దోపిడీ గురించి ఉన్నది ఉన్నట్టు 'సాక్షి' తెలిపిందని ప్రజలు చర్చించుకోవడం విశేషం. రశీదులు ఇవ్వకుండా చందాలు వసూలు చేయడమేంటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రథసప్తమి ఉత్సవాల్లో అన్నదానం నిర్వహణకు సంబంధించి దాతల చందాలకు రశీదులు ఇవ్వకపోవడమేంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కొందరు స్వార్థపరులు స్వామి వారి ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలే ప్రవర్తించడం సిగ్గుచేటని అంటున్నారు. రెండేళ్లుగా నూతన కమిటీ మాదిరిగా ఇప్పుడు కూడా నిర్వహించాలని, చందాలకు రశీదులు ఇవ్వాలని, జవాబు దారీతనంతో, పారదర్శకంగా ఉత్సవాలు నిర్వహించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కూటమి నేతల సంబరాలు ఎందుకో?

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన విషయంలో కూటమి నేతలు సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కార్మికులు జీతాలు సరిగా ఇవ్వడం లేదని, 25 వేల మంది కార్మికులకు గాను 10 వేల మందితో ప్లాంట్ నడుస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు హాలిడే ప్రకటించి, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంతంగా గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ విశాఖకు వచ్చిన సమయంలో ప్రకటించిన ప్యాకేజీ ఇప్పుడు కేంద్ర మంత్రులు ప్రకటించడం వెనుక మతలబు ఏంటో అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తిరగటి శివ, మాల మహానాడు రాష్ట్ర నేత డి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేమనకు నీరాజనం

- ఆరవల్లిలో ఘనంగా వేమన శత జయంత్యుత్సవాలు
- శునకాలకు అన్నదానం

అత్తిలి: మానవ జీవితానికి సంబంధించిన అనేక నిత్యసత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి తెలుగువారి హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిన ప్రజా కవి యోగి వేమన. అత్తిలి మండలం ఆరవల్లిలో వేమనకు మందిరాన్ని నిర్మించి, ఏటా జనవరి 18న వేమన జయంతిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం వేమన 100వ జయంత్యుత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. వేకువజామున వెలగల దాసు వంశీయులు వేమనకు గోస్తనీ నది స్నానం చేయించారు. వేమన మందిరాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేమనను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కీర్తనలు, కోలాట భజన, సినీ సంగీత విభావరి నిర్వహించారు. బ్యాండు మేళాలు, మంగళ వాద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ విశేషంగా అలంకరించిన పల్లకీపై వేమన చిత్రపటాన్ని ఉంచి గ్రామ పురవీధులలో ఊరేగించారు. వేమన పల్లకీ కింద నుంచి తల్లిదండ్రులు తమ చిన్నారులను దాటించారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు ఆయుష్షు పెరుగుతుందనేది గ్రామస్తుల నమ్మకం. ఉత్సవాలకు హాజరైన భక్తులకు


వేమన పల్లకీ ఉత్సవం

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద సందడి నెలకొంది. వేమన జయంతి సందర్భంగా గ్రామంలో పండుగ వాతావారణం నెలకొంది. దేశ, విదేశాలలో ఉన్నవారు స్వగ్రామానికి చేరుకుని బంధుమిత్రులతో ఉత్సాహంగా గడిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేమన ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేమన ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి,


శునకాలకు ఆహార పదార్థాలు తీసుకెళ్తున్న దృశ్యం

స్థానిక ప్రముఖులు సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, వెలగల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అత్తిలి మండలం ఆరవల్లిలో విశేష అలంకరణలో యోగి వేమన

వేమనను దర్శించుకున్న సినీ ప్రముఖులు

యోగి వేమనను గ్రామానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత కె.అచ్చిరెడ్డిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి సత్కరించారు. క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలు, మహిళా కబడ్డీ పోటీలను తిలకించారు.

శునకాలకు అన్నదానం

ఆరవల్లి వేమన జయంతి ఉత్సవాలలో శునకాలకు అన్నదానం చేశారు. పలు రకాల ఆహార పదార్థాలను కావిడిలో పెట్టుకుని గ్రామంలో తిరుగుతూ కనిపించిన శునకాలకు విస్తరి వేసి వడ్డించారు.

ఫిబ్రవరి 21, 22న ఎస్ఆర్‌కేఆర్‌లో సింపోజియం


ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సింపోజియం పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీల్లో ၊నిపుణ၊ పేరిట జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. శనివారం కళాశాలలో సింపోజియం పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు, కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ఐఎస్‌టిఈ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎస్.రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సింపోజియంలో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. సింపోజియంలో అయిదు విభాగాలకు చెందిన 17 ఈవెంట్లు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారన్నారు.

క్లుప్తంగా

నిర్వాసితులైన యువతకు న్యాయం చేయాలి


కుక్కునూరులో ఎస్డీసీకి వివరిస్తున్న నిర్వాసితులు(ఫైల్)

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న తమకు పరిహారం విషయంలో అన్యాయం జరుగుతూనే ఉందని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. పరిహారం చెల్లింపులో భాగంగా అధికారులు ముంపు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఇళ్ల వివరాలతో పాటు కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. సర్వే నోటిఫికేషన్ తేదికి ముందు మూడేళ్లుగా ముంపు ప్రాంతంపై జీవనోపాధి పొందుతున్న కుటుంబాలను ఆర్ అండ్ ఆర్ పరిహారానికి అర్హులుగా ప్రకటించింది. నోటిఫికేషన్ తేదికి కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన యువతను ప్రత్యేక కుటుంబంగా పరిగణించి వారికి కూడా ఆర్ అండ్ ఆర్ పరిహారం అందించేలా వివరాలు సేకరించారు. ఈ విషయంలో నోటిఫికేషన్ తేదికి వారం రోజులు వయసు తగ్గిన వారిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. ఈ విషయమై నిర్వాసితులు భూసేకరణాధికారి దృష్టికి తీసుకెళ్లినా చట్టం ప్రకారం ఇవ్వడం కుదరదనడంతో చేసేది లేక నిర్వాసితులు మిన్నకుండి పోయారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో 18 సంవత్సరాల వయసు నిండలేదని పరిగణలోకి తీసుకోని వారికి ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు?

భీమవరం: పట్టణంలో ఆక్వా వ్యాపారి కిడ్నాప్ కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు ఆదుపులోనికి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణానికి చెందిన వి.సత్యనారాయణను టౌన్ రైల్వేస్టేషన్ వద్ద కొంతమంది కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. అనంతపురం ప్రాంతానికి చెందిన కొంతమందికి దాదాపు రూ.5 కోట్ల వరకు బాకీ ఉండగా సక్రమంగా చెల్లించకపోవడం కిడ్నాపునకు కారణమని తెలుస్తోంది. 2020లో ముగ్గురు వ్యక్తులకు బాకీ పడిన సొమ్ముకు సంబంధించి సెటిల్‌మెంట్ చేసుకోగా ఒప్పందం మేరకు సొమ్ములు చెల్లించకపోవడంతో అనంతపురం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ద్వారా కిడ్నాప్ చేయించినట్లు తెలిసింది.పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ కాళీచరణ్ తన సిబ్బందితో విచారణ చేపట్టగా సీసీ ఫుటేజ్ ఆధారంగా కిడ్నాప్‌లో పాల్గొన్న 12 మందిలో ఏడుగురిని అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

చెరువులకు మైకా బరకాలతో రక్షణ

భీమవరం: ఆక్వా సాగులో నష్టాలు చవిచూస్తున్న రైతులు ఖర్చు తగ్గించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల రొయ్యలకు తెగుళ్లు అధికం కావడంతో అనేకమంది రొయ్యల సాగును పక్కనపెట్టి చేపల సాగువైపు మక్కువ చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఇటీవల రొయ్యల ధరలు కొంతమేరకు ఆశాజనకంగా ఉన్నా వైరస్ వంటి తెగుళ్లు పెరిగిపోయి తక్కువ కౌంట్‌లో పట్టుబడులు పట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా చేతికిరాక రొయ్యల రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రొయ్యల సాగులో ఖర్చు తగ్గించుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. రొయ్యల చెరువులు నిత్యం నీటితో నిండుగా ఉండాలి. గట్టు లీకేజీ, వేసవికాలంలో నీరు ఆవిరి కావడంతో విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించి నీరు తోడాల్సి ఉంటుంది. నీటి లీకేజీలు అరికట్టడానికి కొంతమంది రైతులు సరికొత్త పద్ధతిని అవలంభిస్తున్నారు. గట్ల


భీమవరంలోని రొయ్యల చెరువు గట్టు వెంట మైకా బకరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

చుట్టూ మైకా బరకాలు వేసి నీరు లీకేజీ లేకుండా ఏర్పాటు చేస్తున్నారు. బరకాలు వేయడం వల్ల గట్లు కోతకు గురికాకుండా ఉపయోగపడతాయని చెబుతున్నారు. సముద్ర తీరప్రాంతం, ఇసుక ప్రాంతంలోని భూముల్లోని రొయ్యల చెరువులకు మైకా బరకాలు ఏర్పాట్లు ఎక్కువగా చేస్తున్నారు. మిగిలిన రైతులు కూడా చెరువు గట్ల చుట్టూ బరకాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దెందులూరు: మండలంలోని వేగవరంలో శుక్రవారం రాత్రి పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన అడ్డాల కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ వివరాల ప్రకారం.. వెనుక ఉన్న బైక్ కుమార్ బైక్‌ను ఢీకొట్టింది. అతను ఎద్దుల బండిని ఢీ కొట్టి రోడ్డుపై పడ్డాడు. కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడని వైద్యులు తెలిపారు. సంక్రాంతి పండగకు వచ్చి మృత్యువాత పడడంతో అతని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అంతర పంటలపై ఆసక్తి


ఆయిల్ పాం తోటలో వేరుశనగ


అరటిలో వేరుశనగ


మామిడి తోటలో మొక్కజొన్న


ఆయిల్‌పాంలో మొక్కజొన్న పంట


కొబ్బరిలో అరటి పంట

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో రైతులు అంతర పంటలపై మక్కువ చూపుతున్నారు. ఏటా అతివృష్టి లేదా అనావృష్టితో ఒక పంటకు నష్టం వాటిల్లినా మరో పంట ఆదుకుంటుందన్న ఆశతో ఖర్చుకు వెనుకాడకుండా అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. పెరుగుతున్న ఎరువులు, పురుగు మందులు ఖర్చు, సాగు పెట్టుబడులతో గిట్టుబాటు ధర లభించకపోవడంతో మరింత ఆదాయం కోసం వాణిజ్య పంటలతో పాటు అంతర పంటలపై మొగ్గు చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో 10 వేల హెక్టార్లలో రైతులు అంతర పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంతర పంటల్లో భాగంగా కొబ్బరిలో కోకో, అరటి, వక్క, ఆయిల్‌పాం తోటల్లో వేరుశనగ, మొక్కజొన్న, మామిడిలో మొక్కజొన్న, ఏకకాలంలో రెండు, మూడు రకాల కూరగాయల సాగు చేస్తున్నారు. అంతర పంటల సాగు వల్ల వాణిజ్య పంటల సాగులో పెట్టుబడులను అంతర పంటల నుంచి రైతులు సమకూర్చుకుంటున్నారు. దీనివల్ల కూలీల కొరతను అధిగమించడమే కాకుండ ఎరువులు, పురుగు మందులు వాడినప్పుడు ఖర్చు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించే వీలు కలుగుతుందంటున్నారు. ప్రభుత్వాలు కూడ అంతర పంటల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైతులకు ప్రత్యేక రాయితీలు, రుణాలు అందించి అంతర పంటల సాగు పెరగడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాయితీలు ఇవ్వాలి



అంతర పంటల సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. వాణిజ్య పంటల్లో అంతర పంటలు వేసుకోవడానికి విత్తనాలు ఉచితంగా సరఫరా చేసి రైతులను ప్రోత్సహించాలి. అంతర పంటలు పండించడం వల్ల సాగు ఖర్చులు తగ్గాయి.

– కె రామారావు, రైతు, సీతానగరం

పెట్టుబడులు పెరిగాయి



ప్రస్తుతం వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కూలీలు గ్రామాల్లో దొరకడం లేదు. ఒకేసారి రెండు రకాల పంటలు పండించకపోతే గిట్టడం లేదు. అంతర పంటల వల్ల ఖర్చులు తగ్గి ఆదాయం కూడ వస్తోంది.

– తాండ్ర రామకృష్ణారావు, సర్పంచ్, చింతపల్లి

రబీ సాగుపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం వరినాట్లు పూర్తయ్యాయని, గత సంవత్సరం అనుభవాలు దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. నారుమడి, ప్రధాన పొలం నాటిన నెల రోజుల వరకు కాండం తొలిచే పురుగు, ఆకుముడుత పురుగు ఆశించకుండా ప్రతి సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు వేయాలని కోరారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జడ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయని, ఈ నెలాఖరు వరకు దాదాపు 90 శాతం నాట్లు పూర్తవుతాయని అన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గిరిజారాణి దాళ్వాలో ఎంటీయూ 1121, పీఆర్ 126 రకాలకు ప్రత్యామ్నాయమైన ఎంటీయూ 1293, ఎంటీయూ 1273 రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ కృష్ణాజీ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

జ్యూయలరీ షాపులో అగ్ని ప్రమాదం

తణుకు అర్బన్: తణుకులో జయంతి జ్యూయలర్స్ బంగారు దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది, మధ్యాహ్నం వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న సమయంలో దుకాణం లోపల ఉన్న రెండు ఏసీల నుంచి మంటలు చెలరేగి దట్టమైన పొగలు కమ్మేశాయి. ప్రమాద విషయాన్ని తెలుసుకుని వచ్చిన అగ్నిమాపక వాహన సిబ్బంది మంటలను అదుపు చేశారు. దుకాణంలో ఉన్న రెండు ఏసీలు కాలిపోయాయని ఇతర నష్టమేమీ జరగలేదని యజమాని కాన్‌రాజ్ తెలిపారు.


తణుకులో అగ్నిప్రమాదం జరిగిన జయంతి జ్యూయలర్స్ దుకాణం

ఎక్సైజ్ దాడులు ఆపాలి

తణుకు అర్బన్: గీత కార్మికులపై ఎక్సైజు అధికారుల దాడులు తక్షణమే ఆపాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తణుకు అమరవీరుల భవనంలో శనివారం నిర్వహించిన కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బెల్టు షాపులు, అక్రమ మద్యం అరికట్టలేని ఎక్సైజ్ విభాగం గీత కార్మికులపై దాడులు చేసి అవమానపరుస్తున్నారని ఇకపై ఊరుకోబోమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో గీతవృత్తిని కాపాడతామని, గీత కార్మికుల కార్పొరేషన్‌కి నిధులు కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు చేయించడం దుర్మార్గమన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎక్సైజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై మద్యాన్ని ఏరులై పారించడంతో కల్లు అమ్మకాలు లేక గీత కార్మిక కుటుంబాలు పస్తులు ఉంటున్నారని విమర్శించారు. గీత కార్మికులకు పెన్షన్లు ఆంక్షలు లేకుండా 50 సంవత్సరాలకే ఇవ్వాలని, వడ్డీ లేని రుణాలు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సభ్యులు కడలి పాండు, బొంతు శ్రీనివాస్, బొక్క చంటి, కాసాని శీను తదితరులు పాల్గొన్నారు.


తణుకులో మాట్లాడుతున్న కల్లు గీత కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ఎల్లలు దాటి.. ప్రేమతో ఒకటై



వారి మనసులు కలిశాయి. దేశాల సరిహద్దులు చెరిగిపోయాయి. ఆంధ్ర అమ్మాయి, జర్మనీ అబ్బాయిల ప్రేమకు పెద్దలు అంగీకారం తెలపడంతో టి.నరసాపురం మండలం ఏపుగుంట గ్రామంలో నిశ్చితార్థం వైభవంగా జరిగింది. ప్రేమకు ఎల్లలు లేవని నిరూపిస్తూ పెళ్లివైపు అడుగులు వేశారు. ఏపుగుంటకు చెందిన కూనపాము లావణ్య నాలుగేళ్ల క్రితం జర్మనీలోని మెల్లె నగరంలో నర్సింగ్ విద్యను అభ్యసించేందుకు వెళ్లింది. కోర్సు పూర్తిచేసిన అనంతరం, అక్కడే ఓ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆసుపత్రిలోనే ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న జర్మనీకి చెందిన మార్కస్‌తో పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమగా మారడంతో వారి ప్రేమను తల్లిదండ్రులకు తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 4న లావణ్య, మార్కస్‌లు ఏపుగుంట చేరుకున్నారు. శనివారం ఆర్‌సీఎం చర్చిలో మత గురువులు, స్థానికుల సమక్షంలో వివాహ నిశ్చితార్థ వేడుక ఘనంగా నిర్వహించారు.

– టి.నరసాపురం


సెమీస్‌లో తలపడుతున్న కోల్‌కతా, మహారాష్ట్ర పురుషుల జట్లు


కబడ్డీ పోటీలు తిలకిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం హష్మి

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ఫైనల్స్‌కు కోల్‌కతా, మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ జట్లు

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలో జరుగుతున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో కోల్‌కతా పోలీస్, మహారాష్ట్ర జట్లు, మహిళల విభాగంలో రాజస్థాన్, ఢిల్లీ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. శనివారం ఉదయం నుంచి లీగ్‌లో చివరి మ్యాచ్‌లు, సెమీఫైనల్స్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఫ్లడ్‌లైట్స్ వెలుతురులో అర్ధరాత్రి వరకూ ఫైనల్స్ జరగనున్నాయి. మ్యాచ్‌లను కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఎస్పీ నయీం హష్మీ తిలకించారు. గెలుపొందిన జట్లకు రూ.7.50 లక్షల ప్రైజ్‌మనీ, షీల్డ్‌లు అందిస్తారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, పోటీల కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ డి.శ్రీవేద, వి.వీర్రెంకయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి కొట్టు


జద్దు హరిబాబును పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఇటీవల పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను శనివారం మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబును, బంగారుగూడెం ఎంపీటీసీ బుర్ల సుబ్బలక్ష్మిని, తనుబోను కనులమ్మ కుటుంబ సభ్యులను, మాధవరంలో గంధం రమేష్ (బాబి)ను పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, కొమ్ముగూడెం సొసైటీ మాజీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, నాయకులు బొద్దాని శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, సిర్రావు శాంతకుమార్ తదితరులు ఉన్నారు.

వాహనాలను ఏకాగ్రతతో నడపాలి


తణుకు ఆర్టీసీ డిపోలో మాట్లాడుతున్న పట్టణ సీఐ కొండయ్య

తణుకు అర్బన్: రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మానవ తప్పిదాలే కారణమని తణుకు పట్టణ సీఐ నాగుల కొండయ్య అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం తణుకు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకాగ్రతతో చేసే డ్రైవింగ్ ఎంతో సురక్షితమని, డ్రైవర్లంతా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు కారకాలని స్పష్టం చేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం పాలగిరి వెంకట సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


పెంటపాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ సుజాత రాణి

పెంటపాడు: పెంటపాడులోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సుజాత రాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని లోపాలను తెలుసుకున్నారు. పోషణ అభియాన్, టాయిలెట్ల పరిస్థితి, ఆధార్ వివరాలు, విద్య, తదితర విషయాలను సిబ్బందిని, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డవలప్‌మెంట్ పీడీ టీఎల్ సరస్వతి, సూపర్‌వైజర్లు దుర్గాభవాని, ఎం.సుజాత, జీజీబీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరవల్లిలో వేమన విగ్రహావిష్కరణ


ఆరవల్లిలో వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, చిత్రంలో నిర్మాత అచ్చిరెడ్డి, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి

అత్తిలి: వేమన పద్యాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. వేమన శత జయంతి ఉత్సవాల సందర్భంగా అత్తిలి మండలం ఆరవల్లి వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన యోగివేమన విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత కె అచ్చిరెడ్డి, వేమన ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, ఆనాల ఆదినారాయణరావు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ జాతర

నరసాపురం రూరల్: మొగల్తూరులోని నడివీధి ముత్యాలమ్మ వారి జాతరను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహించి అనంతరం దర్శనం కల్పిస్తారు. పూజలు అనంతరం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు జాతర నిర్వహించి అమ్మవారిని సాగనంపుతారు. ఏటా ముక్కనుమ వెళ్లిన మరసటి బుధవారం లేదా ఆదివారం అమ్మవారు జాతరను నిర్వహించడం ఆనవాయితీ.

నకిలీల పేరుతో ఏరివేతకు కుట్ర

- భయంగుప్పిట్లో పింఛనుదారులు
- వెరిఫికేషన్ పేరుతో పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం కసరత్తు
- పెంచడం ఎందుకు, తొలగించడం ఎందుకంటున్న దివ్యాంగులు


ఇరగవరంలో పింఛనుదారుల ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)


వికలాంగ పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

తణుకు అర్బన్: దివ్యాంగుల్లో పింఛన్ పెరిగిందన్న సంతోషం ఆరు నెలలు గడిచేలోపే కూటమి ప్రభుత్వం కోత వేసేందుకు చూస్తున్న వైనాన్ని పింఛనుదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. పింఛన్ల తొలగింపు కోసం కూటమి ప్రభుత్వం వైద్య శాఖ ద్వారా నిర్వహిస్తున్న వైద్యపరీక్షలు పింఛన్‌దారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. అక్రమంగా పింఛన్లు పొందారంటూ ప్రభుత్వ ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 6వ తేదీ నుంచి పింఛన్ల వెరిఫికేషన్‌తో పింఛన్‌దారులు వారి కుటుంబసభ్యులు తమ పింఛను ఉంచుతారో లేదోనని బెంబేలెత్తిపోతున్నారు. మొదటి విడతలో భాగంగా ముందుగా మంచానికే పరిమితమై రూ. 15వేలు పింఛను పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్యనిపుణులు సదరు పింఛను సక్రమమేనా అనే దిశగా విచారణ చేస్తున్నారు. దీంతో వచ్చిన అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ చేస్తారా లేక ఏదైనా ఇబ్బందులకు గురిచేసి పింఛన్‌ను నిలిపివేస్తారా అనే విషయంలో పింఛన్ దారులతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొన్ని పేద ఇళ్లలో ఆ పింఛనుతోనే జీవనోపాధిగా కాలం గడుపుతున్న వారిలో పింఛను తొలగిస్తే ఏంచేయాలంటూ మదనపడుతున్నారు. రెండవ దఫాలో భాగంగా వచ్చేనెలలో దివ్యాంగులుగా నిర్ధారణ ధ్రువపత్రాలతో రూ. 6వేలు పొందుతున్న పింఛన్ దారులకు సచివాలయ సెక్రటరీలు ఇచ్చే నోటీసు ప్రకారం ఆయా తేదీల్లో సంబంధిత ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు తిరిగి చేయిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో ఆ వర్గాలు కూడా భయాందోళనలో కాలం గడపుతున్నారు. అంతేకాకుండా కూటమి నాయకులు కూడా తమ పింఛనును తొలగించే కుట్రలు ఏమైనా పన్నుతారేమోననే భయం కూడా దివ్యాంగుల్లో ప్రత్యక్షంగా కనిపిస్తుంది.

తణుకు నియోజకవర్గంలో..

తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణం, తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో ప్రస్తుతం మంచానికి పరిమితమైన పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి వైద్యనిపుణులు పరీక్షలు చేస్తున్నారు. దివ్యాంగులకు వచ్చేనెలలో ఆయా ఆస్పత్రుల్లో వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు తిరిగి చేయనున్నారు. మంచానికి పరిమితమై రూ. 15వేలు పింఛను తీసుకుంటున్న పింఛనుదారులు తణుకు నియోజకవర్గంలో 262 మంది ఉండగా, రూ. 6వేలు పింఛను తీసుకుంటున్న పింఛనుదారులు 4,484 మంది ఉన్నారు.

పింఛన్ల తొలగింపునకే సర్వేలు



కూటమి ప్రభుత్వం పెంచిన పింఛన్లను కుదించాలనే దురుద్దేశ్యంతో పింఛన్ల వెరిఫికేషన్ కుట్రకు తెరతీసింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం మంచానికి పరిమితమై రూ. 15వేలు పింఛను తీసుకుంటున్న వారిని కుదించాలనే దుర్మార్గానికి ఒడిగట్టింది. రెండో దఫాలో రూ. 6వేలు పింఛను తీసుకుంటున్న వారిని తిరిగి ఆస్పత్రులకు రప్పించి వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు చేయించేందుకు పన్నాగం పన్నింది. పింఛను మొత్తాన్ని పెంచడం ఎందుకు తిరిగి కుదించేందుకు ఇన్ని కుట్రలు పన్నడం ఎందుకు. పైగా నిర్ధారణకు వచ్చే వైద్యులపై కూడా ఒత్తిడి చేసే విధంగా ఆదేశాలు జారీచేశారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీల ధరలు పెంచిన ప్రభుత్వం దివ్యాంగుల నోటికాడ కూడు కూడా లాగేసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లుగా ఉంది.

– బుదితి సుజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షుడు

పింఛను లబ్ధిదారుల వివరాలు

	రూ. 15 వేలు పింఛను	రూ. 6 వేలు పింఛను
తణుకు అర్బన్	67	992
తణుకు రూరల్	55	1042
ఇరగవరం	73	1169
అత్తిలి	67	1281

ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందించాలి


తణుకు కోర్టులో సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: గ్రామాల్లో ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందాలనే పారాలీగల్ వలంటీర్లు (న్యాయసేవా సహాయకులు)ను ఏర్పాటుచేసిన ప్రధాన ఉద్దేశ్యమని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో శనివారం పారాలీగల్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి పనిచేయాలని, గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సలహా, సహాయం అందించాల్సిన బాధ్యత పారా లీగల్ వలంటీర్లు తీసుకోవాలని, పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని స్పష్టం చేశారు. వారికి ఎటువంటి సమస్యలు తలెత్తినా మండల న్యాయసేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించాలని ఆదేశించారు. పారా లీగల్ వలంటీర్లు జాతీయ ఉచిత న్యాయ సేవల సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 15100 ద్వారా ఉచిత న్యాయ సలహా సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏవీ నాగరాజు, న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, పొనంగి శ్రావణి సమీరా, అంగజాల అజయ్‌కుమార్, తణుకు కోర్టు పరిధిలోని 7 మండలాల పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణలో చిరు వ్యాపారులే తొలి వైద్యులు


మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

తాడేపల్లిగూడెం (టీటీసీ): శుచి, నాణ్యతతో కల్తీ లేని ఆహారాన్ని అందించడంలో చిరు వ్యాపారులే బాధ్యతగా వ్యవహరించాలని, వారే తొలి వైద్యులని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛత, కల్తీ లేని ఆహారంపై చిరు వ్యాపారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులు లాభసాటి వ్యాపారంతో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని వినియోగదారులకు అందించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. 12 నెలలు పాటు ప్రతి నెల మూడో శనివారం పరిసరాలు పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, కల్తీ లేని ఆహార పదార్థాలు తదితర అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. చిరువ్యాపారులు కల్తీ లేని నూనెలు వాడాలని, ఆహార పదార్థాలను ప్లాస్టిక్ రహిత వస్తువులలో అందించాలని సూచించారు. కలుషిత ఆహారం వల్ల పిల్లలకు, పెద్దలకు జీర్ణాశయ సమస్యలు, అవయవాలపై దుష్ప్రభావం తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. అనుమతించిన ఫుడ్ కలర్స్ మాత్రమే వినియోగించాలని, ప్లాస్టిక్‌ను నిరోధించాలని చెప్పారు. టీ హోటల్స్‌లో తప్పక గాజు గ్లాసులను మాత్రమే వినియోగించాలని చెప్పారు. ఆహార పదార్థాల తనిఖీకి ఆర్డీఓ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫిబ్రవరి 1 నుంచి కమిటీ ఆకస్మికంగా తనిఖీలు చేస్తుందని వెల్లడించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. ఆర్డీఓ ఖతీబ్ కౌసర్ భానో, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.రఘు, తహసీల్దార్ సునీల్ కుమార్, వై.శ్రీనివాస్, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి


మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీటీసీ): పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్సైజ్ స్టేషన్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆఫీసర్ స్వరాజ్యలక్ష్మి, సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి, జగన్నాథపురం తదితర గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినతాడేపల్లిలో రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తా చెదారాలను మాజీ ఎంపీపీ పరిమి రవి కుమార్ ఆధ్వర్యంలో శుభ్రంచేశారు. జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రావరపు చంద్రిక మాట్లాడుతూ ఇళ్లల్లోని చెత్తా, చెదారాలను రోడ్లపై వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ ఈవో బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, నాయకులు ఉండ్రాజవరపు రాజు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


జగన్నాథపురంలో రోడ్ల వెంబడి చెత్తా చెదారాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ఇరగవరం జెడ్పీ హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇరగవరం: ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఒకే బడిలో కలిసి చదువుకుని వారంతా విడిపోయి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మళ్లీ 20 ఏళ్ల తరువాత కలిసి బాల్య జ్ఞాపకాలతో శనివారం మురిసిపోయారు. ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాల్లో కలుసుకుని ఆనందంగా గడిపారు. దుబాయిలో స్థిరపడిన వారు సైతం అపూర్వ సమ్మేళనానికి విచ్చేశారు. 20 ఏళ్ల తర్వాత ఎవరెవరు ఎక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. అనంతరం ఆట పాటలతో హోరెత్తించారు. అంతక ముందు అప్పటి ఉపాధ్యాయులను రంగనాథాచార్యులు, రామసూర్యనారాయణ, మూర్తి, పీడీ సుధాకర్, అంజనాదేవి, హెచ్పీ, వెంపటాపు, నిరీక్షణ రాజు, మురాల సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి చిన్నబాబు, పి. శారదాదేవి, వీవీ రత్నం, నెక్కంటి లలిత, యిందుకూరి సునీత కోటి దిలీప్ ఆధ్వర్యం వహించారు.

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

అత్తిలి: ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని తులసి మాలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: వేర్వేరు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి మద్యం బెల్ట్ షాపుల నిర్వాహకులు ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్య లక్ష్మి తెలిపారు. శనివారం ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలం మోదుగగుంట, పెంటపాడు మండలం దర్శిపర్రులో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 22 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. మద్యం దుకాణ యజమానులు బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తే రూ.5లక్షలు జరిమానా విధిస్తామని, రెండవ సారి నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సహాయం

యలమంచిలి: మండలంలోని వడ్డిలంక గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కామన మారియ్య–నాగమణి, కామన నాగేశ్వరరావు–దుర్గాభవాని ఇతర కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఓదార్చారు. అనంతరం తనవంతు సహాయంగా బాధితులకు బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, లుంగీ, టవల్స్, చీరలు, రూ. 2000 నగదు అందించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ పొన్నమండ నాగరాజు, నారినమెరక ఎంపీటీసీ సభ్యుడు ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు.

అలరించిన సినీ మ్యూజికల్ నైట్


సినీ గీతాలను ఆలపిస్తున్న సింగర్స్

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని కొబ్బరితోటలో వేంచేసియున్న శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 45వ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శేషారెడ్డి ఆధ్వర్యంలో సూర్య సౌండ్స్ సౌజ్యంతో మాస్ట్రో మెలోడిస్ సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కొత్త, పాత పాటలతో కూడిన సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది. సంగీత అభిమానులు, మహిళలు విశేషంగా హాజరయ్యారు. నవోదయ ఫ్రెండ్స్ యూనియన్ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

పెంటపాడు: ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని మండలంలో పలు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు, కాగులంపాడు ప్రాంతాల్లో పార్టీ నాయకులు రేవళ్ల సోమరాజు, వీర్ల కృష్ణ, పుట్టా అబ్బులు కడకట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పేదలకు పండ్లు పంపిణీ చేసారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమామహేశ్వరంలో పలువురు నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

తాడేపల్లిగూడెం రూరల్: దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని మండలంలోని మాధవరం, నవాబుపాలెం, చినతాడేపల్లి, నందమూరు తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. పలువురు కూట మి నాయకులు పాల్గొన్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి

వీరవాసరం: మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి ద్వాక్రా మహిళ పనిచేయాలని ఎంపీడీఓ కె.రవి కిరణ్ కుమార్ అన్నారు. వీరవాసరం ద్వాక్రా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు అభివృద్ధి సాధిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని వివరించారు. ఏపీఎం కె.జ్యోతిరాణి మాట్లాడుతూ మహిళామణులకు ఆర్థిక విద్య ,అడల్ట్ ఎడ్యుకేషన్, ఈ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై మండలంలో ఎంపిక చేసిన 20 మంది వీఎల్వోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కామిశెట్టి వీర విజయలక్ష్మి, పంపన మల్లేశ్వరి, విప్పర్తి సరోజిని పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత


పెంటపాడులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో చెత్తను ఊడ్చుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు: పరిసరాల శుభ్రత ప్రజలందరిపై తప్పక ఉందని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి పేర్కొన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొని చెత్తను ఊడ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్రంలోని జిల్లాను పరిశుభ్రతలో ప్రథమస్థానంలో నిలిపేలా అధికారులు, ప్రజలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతీ నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల్లో తప్పక చేపట్టాలన్నారు. దీనిని ఒక ఉద్యమంలా చేయాలని అధికారులు తప్పక భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. వీధుల్లో చెత్తను వేయవద్దని సూచించారు. మురుగు కాలువలు, సాగునీటి, తాగునీటి కాలువల్లో చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ చెత్తను నిర్మూలించడంతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజలు డ్రైయిన్లలో వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

పెంటపాడు: ప్రభుత్వం నూతనంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లలతో కలిసి సిబ్బంది పీహెచ్‌సీలను శుభ్రం చేసారు. ఆవరణలోని చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిజ్ఞలు చేసారు. ఇక నుంచి ప్రతి మూడో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. డాక్టర్లు తోట రాజేష్, మౌనిక, పవన్‌కుమార్‌లతో పాటు, సిబ్బంది సత్యనారాయణ, తేజోనాథ్, సాయి, సుజాత పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో స్వచ్ఛ ఆంధ్ర

తణుకు అర్బన్: ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు వైద్యుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆస్పత్రి ఆవరణలో వైద్యులు, సిబ్బంది ఆవరణను శుభ్రం చేసి చెత్త, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ వైద్య వర్గాలంతా ఆస్పత్రి ఆవరణలో ఎటువంటి చెత్త వేయకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణం మంచి ఆరోగ్యానికి సంకేతమని స్పష్టం చేశారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఎంవో డాక్టర్ సాయిబాలాజీ, డాక్టర్ పి. రాజరాజేశ్వరి, వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాస్యత శాతం పెంచేందుకు సమష్టి కృషి

అత్తిలి: నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్ది అక్షరాస్యత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో పి శామ్యూల్ కోరారు. శనివారం అత్తిలి మహిళా సమాఖ్య భవనంలో ఏపీఎం మహమ్మద్ అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాలను అందజేసారు. సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తాడేపల్లిగూడెం రూరల్: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండల మహిళా సమాఖ్యభవనంలో ఉల్లాస్ కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలనేది ప్రభుత్వ ఆశయమన్నారు.